క్లుప్తంగా

రక్తదానం మహోన్నతం



పందలపాకలో రక్తదానం చేస్తున్న యువకులు

బిక్కవోలు: రక్తదానం మహోన్నతమని పందల పాక రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి అయ్యప్ప రెడ్డి అన్నారు. స్థానిక రెడ్డి రామాలయం వద్ద గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి ఋచ్చిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ రక్తదానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం ఎక్కించడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కాకినాడ నుంచి వచ్చిన సిద్ధార్థ వలంటీర్ బ్లడ్ సెంటర్ వైద్యులు 51 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో కొవ్వూరి సతీష్ రెడ్డి, సం ఘాయితీ వార్డు సభ్యులు పడాల దుర్గా రెడ్డి, రొంగల దుర్గా ప్రసాద్, పడాల భాస్కర్ రెడ్డి, కొలా సూర్య గంగాధర్, మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి



వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని గురువారం అనప ర్తిలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి వాజ్‌పేయి విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు. అలాగే కుతుకులూ రులో పార్వతీ సమేత కాటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా పలు సౌక ర్యాల అభివృద్ధికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

లంక భూముల పరిశీలన



ములకలంక గ్రామంలో లంక భూములను పరిశీలిస్తున్న జేసీ చిన్న రాముడు

సీతానగరం: ప్రక్కిలంక, తాళ్లపూడి, ములక లంక గ్రామాల్లోని లంక భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు గురువారం పరిశీలించారు. ఈ గ్రామాల పరిధిలోని 22 మంది రైతులు తమ లంకభూమిలో ఇసుకను తొలగించేందుకు అనుమతులు ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్నారు. దీంతో రాజమహేం ద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితతో కలిసి జేసీ ఆయా లం కభూములను పరిశీలించారు. మండల సర్వే యర్ గౌతమ్ నాలుగు ఎకరాలను సర్వే చేసి, బౌండరీలను గుర్తించి చూపించారు. రైతులు పెట్టుకున్న దరఖాస్తులో ఉన్న సర్వే నెంబర్లలో ఇసుక ఉందా, గోదావరి నీరు ఉందా అన్న విష యాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఎ.శ్రీని వాస్, తాళ్లపూడి డిప్యూటీ మోహన భాగవ ఆ దరఖాస్తుల్లో ఉన్న భూమి వివరాలను వివరిం చారు. సంబంధిత రైతులతో మాట్లాడారు. ఇసుకను తొలగిస్తే పంటలు వేసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ మల్లికా ర్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రకాష్, ఏఈఎంటీ ఏ ఈశ్వరప్రసాద్, మైన్స్ అసిస్టెంట్ జియాల జిస్ట్ విశ్వేష్, వీఆర్వో లీలా ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి వంగవీటి రంగా పోరాటం



కాపవరంలో రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకట రమణ తదితరులు

బిక్కవోలు: పేదల సంక్షేమం కోసం వంగవీటి మోహనరంగా అలుపెరగని పోరాటం చేశారని కాపవరం సర్పంచ్ సత్యనారెడ్డి వెంక టరమణ అన్నారు. రంగా వర్ధంతి సందర్భం గా గురువారం గ్రామంలోని ఆయన విగ్ర హానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ వెంకట రమణ మాట్లాడుతూ రంగా ఏ ఒక్క కులానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరి హృదయాల్లో చిరస్మరణీయు డిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోసిన గోపాలకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిడదవోలు శ్రీను, రాధా రం గా మిత్ర మండలి జిల్లా కార్యదర్శి సత్యనారెడ్డి ఉమా మహేష్ పాల్గొన్నారు.

మొక్కుబడి సదస్సులు

- తూతూమంత్రంగా గ్రామసభలు
- సమస్యలకు లభించని పరిష్కారం
- అంతంతమాత్రంగానే దరఖాస్తులు
- ఆసక్తి చూపని ప్రజలు



రైతు సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

బిక్కవోలు: నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా జరుగుతున్నాయి. గ్రామ సభలలో స్వీకరిస్తున్న దరఖాస్తులకు పరిష్కారం ప్రశ్నార్థక గా మారింది. కొన్ని దరఖాస్తులను సభల్లోనే పరిష్కరించి అర్జీదారులకు ధ్రువపత్రాలు అందిం చాల్సి ఉన్నా, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. వివిధ కారణాలతో తిరస్కరిస్తుండటంతో దరఖాస్తులు కూడా నామమాత్రంగా వస్తున్నట్లు సమాచారం. సుమారు 8 గంటల పాటు జరిగే సదస్సులో ఒక్కటి, రెండు గ్రామాల్లో మినహా మిగిలిన చోట రెండు పదుల దరఖాస్తులు కూడా దాటడం లేదు.

12 నుంచి ప్రారంభం

రెవెన్యూ సదస్సులను నియోజకవర్గంలో ఈ నెల 12వ తేదీన అధికారులు ఆర్భాటంగా ప్రారంభిం చారు. తొలి రోజు నుంచి ఇప్పటి వరకూ 272 దరఖాస్తులు వచ్చాయి. ఇలా ఇప్పటికి 31 గ్రామాల్లో సదస్సులు జరిగాయి. వీటిలో అనపర్తి మండలంలోని ఐదు గ్రామాల్లో 34, బిక్కవోలు మండలంలోని ఆరు గ్రామాల్లో 37, పెదపూడి మం డలంలోని 12 గ్రామాల్లో 32, రంగంపేట మండ లంలోని 8 గ్రామాల్లో 169 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో మ్యుటేషన్, సర్వే కొలతల్లో వ్యత్యాసం, అడంగల్ కరెక్షన్, పాసు పుస్తకాలు, పేరు మార్పు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, డిజిటల్ సంత కం, ఆక్రమణలు తదితర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందించారు. తహసీల్దార్ కార్యా లయం సిబ్బంది పనితీరు, అవినీతిపై కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సదస్సుల్లో స్వీకరిస్తున్న దరఖాస్తులకు గడువు విధిస్తుండటంతో మళ్లీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పని తప్పేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమాచారం ఎక్కడ ?

రెవెన్యూ సదస్సులకు వచ్చిన ఫిర్యాదులు, వాటిలో పరిష్కరించిన సమస్యలను ప్రజలకు తెలియజే యాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏ గ్రామంలో సదస్సుకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించారో చెప్పాల్సి ఉంది. అయితే వచ్చిన ఫిర్యాదుల సమాచారం మాత్రమే పత్రిక లకు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. పరి ష్కరించిన సమస్యల వివరాలు తెలపడం లేదు.

ప్రజలకు నిరాశే..

తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పనిలేకుండా ఈ సదస్సుల ద్వారా తమ భూముల సమస్యలు, కష్టాలు తీరుతాయని రైతులు, ప్రజలు ఆశించారు. వాటిపై దరఖాస్తులు కూడా అందజేశారు. అయితే ఆ సమస్యల పరిష్కా రానికి అధికారులు పెద్దగా శ్రద్ధ చూపడం లేదు.

దశల వారీగా పరిష్కారం



రైతు సదస్సులకు వచ్చిన అర్జీలను దశల వారీగా పరిష్కరిస్తున్నాం. వీటిపై ముం దుగానే గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దానిలో భాగంగా ప్రజల్లో నిర్వహిస్తున్నాం.

– వీవీవీ సత్యకృష్ణ, తహసీల్దార్, బిక్కవోలు

దీంతో గ్రీవెన్స్ లాగే ఈ రెవెన్యూ సదస్సుల కార్య క్రమం కూడా ఆటూపోటూ కాక తప్పదనే విమ ర్శలు వినిపిస్తున్నాయి. అర్జీల పరిష్కారానికి గడువు విధిస్తుండటంతో మళ్లీ తహసీల్దార్ కార్యాలయాలు, వీఆర్వోల చుట్టూ రోజుల తరబడి తిరగడం తప్పేలా లేదని వాపోతున్నారు.

పరిష్కారమేది!

రెవెన్యూ సదస్సుల్లో స్వీకరిస్తున్న దరఖాస్తుల్లో కులం, ఆదాయం, డిజిటల్ సంతకం వంటి సమ స్యలను అక్కడికక్కడే పరిష్కరించాలి. 15 రోజుల్లో 31 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 272 ఫిర్యాదులు రాగా, వాటిలో ఏ ఒక్కటి పరిష్కా రమైన దాఖలాలు కనిపించడం లేదు. కొందరు అధికారులు సదస్సులలో పాల్గొనకుండా, పలు కారణాలు చెబుతూ డుమ్మా కొడుతున్నట్లు తెలిసిం ది. దీంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మించిన గొల్ల మంటపంలో గురువారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభ వంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సాయంతో రూ.5 లక్షలతో 4.5 టన్నుల బరువు, 13 అడుగుల ఎత్తయిన ఏకశిలా ఆంజనేయుని విగ్రహాన్ని తిరుపతి నుంచి ప్రత్యేకంగా వాహ నంలో తీసుకువచ్చారు. ఇక్కడ క్రేన్ సాయంతో ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమి ల్లి రామకృష్ణారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై స్వామివారు



గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

బిక్కవోలు: బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా మూడో రోజు గురు వారం గరుడ వాహ నంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయం త్రం స్వామివారి గ్రామోత్సవం జరిగింది. కార్యక్ర మంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



బూరుగుపూడిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



అనపర్తి ఇండియన్ బైబిల్ మిషన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీ యమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూ డిలోని వైఎస్సార్ సీపీ నాయకుడు కంటే సత్తిబాబు నివాసంలో గురువారం క్రిస్మస్ వేడుకలు నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా హాజరైన జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణ, క్షమాగుణం కలిగిన దేవుడు ఏసుక్రీస్తు అన్నారు. బైబిల్ మిషన్ బిషప్ డాక్టర్ నక్కా విజయరాజు మాట్లాడుతూ క్రీస్తు మార్గాన్ని అనుసరించడం ద్వారా ప్రపంచం లో యుద్ధాలు సమసిపోతాయన్నారు. బైబిల్ పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందిం చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ అడపా కనకరాజు, నాయకులు నక్కా రాంబాబు, కంటే వినయ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

ఏసు జననం మానవాళికి గొప్ప పండగ

పెదపూడి: ఏసుక్రీస్తు జననం సమస్త మానవాళికి గొప్ప పండగ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని సీయోను మందిరం (శిలువలమ్మ చర్చి)లో బుధ వారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, క్రైస్తవు లకు క్రిస్మస్, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ కొత్తపల్లి వెంకటేష్ సమకూర్చిన వస్త్రాలను ఏపీఈపీడీసీఎల్ డిపార్ట్‌మెంట్ సిబ్బం దికి పంపిణీ చేశారు అనంతరం మాజీ ఎమ్మెల్యేను పాస్టర్, సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. అలాగే అనపర్తి గ్రామంలోని ఇండియన్ బైబిల్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. క్విజ్ పోటీలు, నృ త్యాలు, నాటికల్లో విజేతలకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, పాస్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ నేడు ధర్నా



సత్తి సూర్యనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే

పెదపూడి: విద్యుత్ ఛార్జీల పెంపును నిర సిస్తూ వైఎస్సార్ సీపీ శుక్రవారం చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అనపర్తిలో గురువారం మాట్లాడుతూ ఎన్నికల హామీలను తుంగలో తొక్కి, విద్యుత్ చార్జీలను పెంచి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానా లను ఎండగట్టాలన్నారు. విద్యుత్ చార్జీలు పెం చబోమని ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారం లోకి రాగానే ప్రజలపై సుమారు రూ.15,486 వేల కోట్ల విద్యుత్ భారం మోపారన్నారు. ఈ నేపథ్యం లో పార్టీ శ్రేణులు శుక్రవారం ఉదయం 9 గంటలకు అనపర్తికి చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి దుప్పలపూడిలో విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేస్తామ న్నారు. ధర్నా, ర్యాలీ కార్యక్రమానికి నియోజకవ ర్గంలోని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట

రాజానగరం: ఆచరణ సాధ్యం కాని అనేక రకాల హామీలతో ఎన్నికలలో ప్రజ లను మాయచేసి అధికారం లోకి వచ్చిన కూటమి ప్రభు త్వం.. ఇప్పుడు పన్నులను పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యంగా విద్యుత్ ఛార్జీలను అమాంతం పెంచేసి, పేదలను ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో పడవేస్తోందన్నారు. దీన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజానగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైఎ స్సార్ సీపీ పోరుబాట చేపట్టనున్నట్టు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి, ఛార్జీలను తగ్గించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీ మేరకు ఛార్జీల భారాన్ని తగ్గించడంతో పాటు, ఎస్సీ, ఎస్టీలకు 200 యూని ట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పీఎంపీల సేవలు అభినందనీయం



మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, గౌతమ్ రెడ్డిలను సన్మానిస్తున్న ప్రతినిధులు

పెదపూడి: గ్రామాల్లో పీఎంపీలు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రాజ మహేంద్రవరంలోని తిలక్‌రోడ్డులో గల రెడ్డీస్ కన్వెన్షన్ హాల్లో గురువారం అఖిల భారత పీఎం పీ అసోసియేషన్ 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన కుమారుడు, గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ సెంటర్ వైద్యుడు గౌతమ్ రెడ్డిలను ఘనంగా సన్మానించారు.

సురేష్ రెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



సురేష్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: సబ్బెళ్ల సురేష్ రెడ్డి మెమోరియల్ చారిట బుల్ ట్రస్ట్ ద్వారా సేవలు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి కుమారుడు సురేష్ రెడ్డి వర్ధంతిని గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారా యణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహకారంతో సమకూ ర్చిన పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు మరింతగా విస్తృతం చేయా లని, దానికి అవసరమైన సహకారం అందిస్తానని ప్రకటించారు. ట్రస్ట్ అధ్యక్షుడు సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడి పేరు మీద స్నేహితులు ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ఇప్పటికి సుమారు రూ.10 లక్షలతో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టా మన్నారు. మిత్రులు, దాతల సహకారంతో మరింత విస్తరిస్తామన్నారు. అనంతరం రామవరం, కుతుకు లూరు, పాలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆయా గ్రామాల నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అనపర్తి వైస్ ఎంపీపీ పులగం బలిరెడ్డి, రామవరం గ్రామ ఎంపీటీసీ సభ్యు రాలు గొలుగూరి గౌతమి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, గుడిమెట్ల వెంకటరెడ్డి, పాలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, నాయ కులు సత్తి వెంకటరెడ్డి, కర్రి గాంధీ రెడ్డి, మంతిన అప్పారావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబోతకు అష్టకష్టాలు



నర్సాపురంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

మధురపూడి: ప్రతికూల వాతావరణ పరిస్థితు లతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా ఏర్పడుతున్న తుపానులతో పనులకు అడుగడుగునా ఆటంకం కలుగుతోంది. తాజాగా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం రాశులను కాపాడుకోవడానికి అవస్థలు పడుతు న్నారు. ధాన్యాన్ని విక్రయించాలంటే తేమ లేకుండా ఆరబెట్టాలి. గత నాలుగైదు రోజులుగా సూర్యుడు పూర్తిస్థాయిలో బయటకు రావడం లేదు. ఒక వేళ వచ్చినా.. కొంత సేపటికి మబ్బులు కమ్ముకుని జల్లులు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం ఆరబోత పనులకు ఆటం కం కలుగుతోంది. ఎండ వచ్చినప్పుడు రోడ్లపై ఆరబెట్టడం, ఏమాత్రం జల్లులు పడినా మళ్లీ బర కాలు కప్పడమే సరిపోతుంది. కాగా..గురువారం స్వల్పంగా ఎండ రావడంతో రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకున్నారు. కోరుకొండ మండలంలో 5,199 హెక్టార్ల విస్తీర్ణంలో ఖరీఫ్ సాగుజరిగింది. దిగుబడి ఆశించినంత జర గలేదు. ఇదిలా ఉండగా..ఈ సంవత్సరం తడి చిన ధాన్యం నుంచి తరుగు పేరిట 10 కేజీలు తీసే విధానంపై రైతులు దిగాలు పడ్డారు.

వేణుగోపాలస్వామికి పూజలు

పెదపూడి: వెంద్ర గ్రామంలోని వేణుగోపాలస్వా మికి గురువారం పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి కుంకుమపూజ, హోమం నిర్వ హించారు. అర్చకుడు సత్యకృష్ణమాచార్యులు, వేద పండితుడు ఖండవల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రవచనం జరిగింది. అధిక సం ఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించు కున్నారు.

28, 29న విద్యుత్ అంతరాయం

రాజానగరం: సంపత్ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరి ధిలో 28, 29 తేదీల్లో సరఫరా ఉండదని ఏపీఈపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. టవర్ లైన్ పనుల కోసం 11 కేవీ ఫీడర్లపై జి.యర్రంపాలెం ఫీడర్‌కు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారన్నారు. ఈ కారణంగా పాత తుంగ పాడు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

కేసు నమోదు

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన సత్యం గం గాధరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలి పారు. గత నెల 30న ఇనుగంటివారిపేట ద్వారక మాయి ఫంక్షన్ హాల్ నుంచి సైకిల్‌పై గంగాధరరావు ఇంటికి వెళుతున్నాడు. ఆ సమయంలో ఆతడిని ఎదు రుగా వచ్చిన తెల్లరంగు కారు ఢీకొంది. ఆ తర్వాత ఆతడికి చాతిలో నొప్పి రావడం మొదలైంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ముంపు బారిన బీర పాదులు

- నాలుగు రోజుల్లో కోతకు సిద్ధం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు



రాపాకలో ముంపులోకి వెళ్లిన బీర పాదులు

సీతానగరం: రాపాక – కోటికేశవరం రోడ్డులోని నాలుగు ఎకరాలు బీర పాదులు ముంపులోకి వెళ్లాయి. ఇప్పటికే సుమారు 20 ఎకరాల మొక్క జొన్న, జొన్న పంట ముంపు బారిన పడిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం ఉదయం బీర పాదుల్లోకి కూడా నీరు చేరింది. రాపాకకు చెం దిన తమ్మిశెట్టి సత్యనారాయణ ఎకరాకు రూ.30 వేల కౌలు చెల్లించేలా 8 ఎకరాలను తీసుకున్నాడు. వాటిలోని నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న వేశాడు. మిగిలిన నాలుగు ఎకరాల్లో బీర పాదులను సాగు చేస్తున్నాడు. నాలుగు రోజుల్లో బీర కాయలను కోయడానికి సిద్ధమవుతుండగా ముంపు బారిన పడ్డాయి. ఎకరానికి ఇప్పటికే రూ.25 వేలు పెట్టుబడి పెట్టానని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

కారణమిదే..

కోతులమెట్ట వద్ద తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ సైఫన్ నుంచి నీరు పొంగి పంట పొలాల్లోకి వచ్చి చేరుతోంది. అక్కడి నుంచి చిన కొండేపూడి అప్పన్నబాబు చానల్ మీదుగా ముంపు కాలు వలో కలుస్తుంది. అది రాపాక – కోటికేశవరం రోడ్డు వద్ద గల మురుకు కాలువ నుంచి పంట లను ముంచుతోంది. దీనిపై తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఏఈ శివరామకృష్ణ వివరణ కోరగా.. కోరు కొండ మండలం కోటి గ్రామానికి తొర్రిగడ్డ పం పింగ్ స్కీమ్ నుంచి సాగునీరు వెళ్లాల్సి ఉంద న్నారు. అందుకే నీటిని ఎక్కువగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రేమ్‌కుమార్ మృతదేహం

మండపేట: సంక్రాంతి పండుగకు కొత్త దుస్తులు కొనుగోలు చేయడానికి వస్త్ర మార్కెట్‌కు బయలు దేరిన ఓ యువకుడు మార్గం మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన ద్వార పూడిలో గురువారం చోటు చేసుకుంది. స్థాని కులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. కేశవరం గ్రామానికి చెందిన గనుగుల ప్రేమ్‌కుమార్ (16) నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ద్వారపూడిలోని వస్త్ర మార్కెట్‌కు మోటారు సైకిల్‌పై వచ్చుతున్నాడు. ఈ క్రమంలో ద్వార పూడి రైల్వే స్టేషన్ ఓవర్ బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి కిందప డ్డాడు. యువకుడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే గ్రామంలోని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కాగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. చేతికి అందివచ్చిన కుమారుడు మరణించడంతో తల్లి బోరున విలపించింది. రాజానగరం మండలం జి.యర్రంపాలెంలో నివాసముంటున్న ఈ కుటుంబం ఇటీవల మృతుడి తండ్రి మంగరాజు మరణించడంతో అక్కడి నుంచి కేశవరం వలస వచ్చారు. మళ్లీ ఇప్పుడు కొడుకు కూడా మృతి చెందడంతో ఆ తల్లి విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.